# నేను నేనే-17

**Index** **Page no**


227. దేహాభిమానమే బ్రహ్మానుభవం, 'నేనెవడను' అనే విచారణ చేయవలసింది బ్రహ్మమే, జీవాత్మ కాదు 2

228. భగవదిచ్ఛ-శరణాగతి 7
229. ఉద్దేశపూర్వకంగా తెచ్చుకున్న మరపు మేలుకో... మేలుకో... 12
230. ప్రార్థన 17
231. సద్గురు మహిమ 22
232. అది అంతే - ఇది ఇంతే 26
233. పరిపక్వత అనేది పలుకులలో లేదు, మౌనంలో ఉంది 31
234. ఎందుకు? మహా నియంత 37
235. మౌనం-ఊరక ఉండడం 44

## 227. దేహాభిమానమే బ్రహ్మానుభవం, 'నేనెవడను' అనే విచారణ చేయవలసింది బ్రహ్మమే, జీవాత్మ కాదు

"ముక్తస్థితిని పొందాలంటే,

దేహాభిమానాన్ని వదలాలి" అని అంటుంటారు కదా!

మరి మీరేమో 'దేహాభిమానమే బ్రహ్మానుభవం' అంటున్నారు...! అని ఒకరు సందేహాన్ని వెలిబుచ్చారు

* * *

'నేను రామారావు అభిమానిని' అంటాను.

అంటే నేను వేఱు, రామారావు వేఱు  అనే కదా!

'నేను ఈ దేహాన్ని అభిమానిస్తున్నాను' అంటే,

"నేను" వేఱు, ఈ దేహం వేఱు అనే కదా!

దేహానికి నేను వేఱుగా ఉంటేనే,

నేను ఈ దేహాన్ని అభిమానించగలను.

దేహాభిమానం ఉండడం దోషమేమీ కాదు,

'నేను ఈ దేహాన్ని కాను' అనే సత్యాన్ని అది తెలుపుతోంది...

బ్రహ్మము తానెవరో  మరచిపోయేంతగా బాబు అనే బొమ్మను అభిమానించి, బొమ్మే తానైపోయింది. సుఖదుఃఖాలను అనుభవిస్తోంది.

మళ్లీ ఇప్పుడు బ్రహ్మమే 'నేనెవడను' అని తనలో తాను విచారించుకొని, తానెవరో తెలుసుకొని, జగత్తంతా తోలుబొమ్మలాటే అని తెలుసుకుని యధాస్థితికి చేరుకుంటుంది.

నేనెవడను? అనే సాధన చెప్పింది బ్రహ్మానికే;

ఈ బాబు అనే బొమ్మకు కాదు.

బొమ్మ జడం - దీనికసలు ఉనికే లేదు.

ఈ బాబు అనే బొమ్మకు బంధమూ లేదు, మోక్షమూ లేదు.

ఈ బాబు అనే బొమ్మకు సాధనా లేదు, సిద్ధీ లేదు.

మరి ఈ బొమ్మే కదా ఈ వ్యాసం వ్రాస్తోంది?

అని సందేహం రావొచ్చు.

కాదు...

బ్రహ్మమే వ్రాస్తోంది...

తానెవరో తాను తెలుసుకోవడంలో భాగంగానే జరుగుతుంది....ఈ పుస్తకపఠనం, వ్యాస రచనం, సద్గురు సహవాసం, ఆత్మవిచారం...

వాహనంలో వాహకుడు ఉన్నప్పుడు మాత్రమే

వాహనంలో చైతన్యం ఉన్నట్టు,

దేహంలో బ్రహ్మం ఉన్నప్పుడు మాత్రమే ఈ జడ దేహంలో చైతన్యం కనిపిస్తుంది.

ఆయన కదలికే మన కదలికగా కనబడుతుంది.

ఆయన పలుకే మన పలుకుగా ఉంటుంది.

అందువల్లనే రమణులు ఈ దేహాన్ని చిత్-జడ గ్రంథి అన్నారు.

గ్రంథి అంటే ముడి.

ముడిలో  చిత్-జడముల (జీవ-ఆత్మల) రెంటి స్పర్శా ఉంటుంది.

పూర్తిగా చిత్తు అయిపోయినా కదలిక ఉండదు.

పూర్తిగా జడం అయిపోయినా కదలిక ఉండదు.

చిత్-జడముల కలయిక ఈ దేహం.

దేహం వల్లనే సంసారం.

సంసారం వల్లనే దుఃఖం.

దుఃఖాన్ని మాపేది ఆత్మవిచారం.

సంసారంలో-

నేను-నాది విడివిడిగా ఉంటాయి.

స్వరూపంలో-

నేను-నాది ఏకమై ఉంటాయి.

పూర్తి చిత్తుకూ సాధన అవసరం లేదు.

పూర్తి జడానికీ(శవానికీ) సాధన అవసరం ఉండదు.

చిజ్జడగ్రంథికే లేదా జీవాత్మకే అన్నీను...

బొమ్మలాటలో పడి, తానెవరో మరచిపోయిన బ్రహ్మమే చిజ్జడగ్రంథి(జీవాత్మ).

నిజానికి చదరంగంలో రెండువైపులా తానే ఉండి, బ్రహ్మము ఆడే ఆటే ప్రపంచం.

ఓటమీ తనదే, గెలుపూ తనదే.

ఆట అనేది మరిస్తే సుఖదుఃఖాలు రెండూ దుఃఖమే.

ఆట అనే గుర్తుంటే సుఖదుఃఖాలు రెండూ సుఖమే.

మరపే బంధం, ఎరుకే మోక్షం.

బ్రహ్మానికి; మనకు కాదు.

మనకసలు ఉనికే లేదు.

అనే తెలివి కూడా బ్రహ్మము యొక్క స్పర్శ వలన కలుగుతోంది...

* * *

బ్రహ్మమే దేహాన్ని అభిమానించి, దానికి తోడునీడగా ఉండి నడిపిస్తోంది, డ్రైవరు బస్సును నడిపిస్తున్నట్లుగా...

"అదిగో బస్సు వస్తోంది..." అంటామేగాని,

అదిగో డ్రైవరు వస్తున్నాడు...అని ఎవరూ అనరు.

అలా 'బాబు వస్తున్నాడు' అంటారేగానీ, బాబు లోపలుండి నడిపే బ్రహ్మాన్ని ఎవడూ గుర్తించడు.

అంటే వాహనానికి ప్రాముఖ్యతనిచ్చి,

వాహకుణ్ణి మరిచిపోతున్నాం.

* * *

'నేను బాబు' అని అనేది బ్రహ్మమే.

'నేను బ్రహ్మమును' అని అనేది బ్రహ్మమే.

బ్రహ్మమునకు-

నేను బాబు అని అనుకుని బాబు అయ్యే శక్తీ ఉంది.

అలాగే అహంబ్రహ్మాస్మి - నేను బ్రహ్మమును అనుకుని తిరిగి బ్రహ్మమయ్యే శక్తీ ఉంది.

బ్రహ్మము సర్వశక్తిమంతము - చైతన్యము.

బాబు అస్వతంత్రుడు - జడము.

* * *

కాబట్టి-

బాబు బ్రహ్మము కావడానికి చేసే సాధన కంటే,

బ్రహ్మమే బాబు అయివున్నది అనే అవగాహన సిద్ధినిస్తుంది.

* * *

## 228. భగవదిచ్ఛ-శరణాగతి

ఒక ఆవు ఒకరోజు గడ్డి మేయడానికి అడవిలోకి వెళ్లింది....

పాపం దానికి సమయం తెలియలేదు...

ఇంతలో సాయంత్రం అయ్యింది...

చీకటిపడేలా ఉంది...

ఇంతలో ఒక పులి తనవైపు పరిగెత్తుకుంటూ రావడం ఆ ఆవు చూసింది...

పులి నుంచి తప్పించుకోవడం కోసం ఆవు అటూ ఇటూ పరుగులెడుతోంది...

పులి కూడా అంతే వేగంగా ఆవుని వెంబడిస్తోంది...

చివరికి ఆవుకు ఎదురుగా కనబడే చెరువులోకి దూకేసింది...

పులి కూడా ఆవుని పట్టుకోవాలని దాని వెనుకే ఆ చెరువులోకి దూకేసింది...

దురదృష్టవశాత్తు ఆ చెరువులో నీళ్ళు చాలా తక్కువ ఉన్నాయి...

ఆవు ఈదుకుంటూ ఈదుకుంటూ చెరువు మధ్యలోకి వెళ్ళిపోయింది...

అక్కడ చాలా లోతైన బురద ఉంది...

అందులో ఆవు పీకల వరకూ కూరుకుపోయింది...

ఆవుని వెంబడిస్తూ వచ్చిన ఆ పులి కూడా

ఆ బురదలో చిక్కుకుని పీకల్లోతులో మునిగి కేవలం తన ప్రాణాలు రక్షించుకోవడం కోసం

ఆవుకి కొద్ది దూరంలో ఆగిపోయింది.

ఇక అంతకుమించి ముందుకి వెళితే ఆ పులి పూర్తిగా బురదలో కూరుకుపోయి చనిపోతుంది.

ఈ స్థితిలో ఉన్న ఆ "ఆవు-పులీ" రెండూ ఒక దానికి ఒకటి ఎదురు ఎదురుగా కదలలేని స్థితిలో నిలబడిపోయాయి.

ఇక రెండూ ఏమీ చేయలేని పరిస్థితిలో ఉన్నాయి కాబట్టి, ఆవు భయం వీడి ఇలా అడిగింది పులిని.

"నీకెవరైనా యజమాని ఉన్నారా?" అని...

ఆ పులి గర్వంతో ఇలా అంది-

"నేనే ఈ అడవికి రాజుని, స్వయంగా నేనే ఈ అడవి అంతటికీ యజమానిని. నాకు వేరే ఎవరు యజమాని ఉంటారు?" అంది గొప్పగా...

అప్పుడు ఆవు ఇలా అంది-

"నీ గొప్పదనం, నీ శక్తి ఇవేవీ కూడా ఇప్పుడు నిన్ను ఈ స్థితిలో రక్షించలేక పోయాయి కదా!

అప్పుడు ఆ పులి అంది -

"నీ పరిస్థితి కూడా నాలాంటిదే కదా! నువ్వు కూడా నాలాగే పీకల్లోతులోకి మునిగిపోయావు, చావుకు దగ్గరలో ఉన్నావు మరి ఇప్పుడు నిన్ను ఎవరు రక్షిస్తారు?"

అప్పుడు ఆవు చిరునవ్వుతో ఇలా అంది-

"చాలా తప్పు. నాకు ఒక యజమాని ఉన్నాడు. సాయంత్రం అయ్యేసరికి నేను ఇంటికి చేరకపోతే నన్ను వెతుక్కుంటూ, ఎంత దూరమైనా వచ్చి నన్ను ఈ బురదనుంచి బయటకు లాగి క్షేమంగా ఇంటికి తీసుకెళతాడు...మరి నిన్ను ఎవరు బయటకు లాగుతారు?"

ఇలా అంటున్న సమయంలోనే ఆ ఆవు యొక్క యజమాని నిజంగానే వచ్చాడు. వచ్చీ రాగానే ఆ అవుని గట్టిగా పట్టుకుని అతి కష్టం మీద ఆ బురదగుంట నుంచి ఆ ఆవుని బయటకు లాగి, తన ఇంటికి తీసుకెళ్లాడు.

అనుకునివుంటే, ఆ ఆవు, మరియు దాని యజమాని వాళ్లిద్దరూ కలిస్తే ఆ పులిని బయటకు లాగగలరు...

కానీ అది వాళ్ళ ప్రాణాలకు ముప్పు అని గ్రహించి, ఆ పులిని బురదలో వదిలేసి వెళ్లిపోయారు.

* * *

ఈ కథలో-

ఆవు - గురువుకు శరణాగతి చెందిన శిష్యుడు.

పులి - కర్తృత్వభావనతో ఉండే అహంకారి.

బురదగుంట - సంసారం.

యజమాని - సద్గురువు.

* * *

'మామేకం శరణం వ్రజ' నన్నొక్కణ్ణే శరణు వేడు అంటారు గీతలో భగవానులు.

అంతరంగమెల్ల శ్రీహరికి ఒప్పించకుంటే

వింత వింత విధముల వీడునా బంధములు...

అంటూ వేంకటేశ్వరునికి శరణాగతి చెందారు అన్నమయ్య...

శరణు శరణు సురేంద్ర సన్నుత

శరణు శ్రీసతి వల్లభా

శరణు రాక్షస గర్వ సంహార

శరణు వెంకటనాయకా....

అంటూ సంకీర్తనం చేశారు అన్నమయ్య...

'సర్వస్య శరణాగతియే నిజమైన ప్రణిపాతము' అన్నారు షిరిడీబాబా.

సదా 'అల్లా మాలిక్ (భగవంతుడే యజమాని) అని పలుకుతుండేవారు బాబా.

'అప్పా! నీ ఆజ్ఞమేరకు వచ్చాను' అంటూ అరుణాచలేశ్వరునికి శరణాగతి చెందారు రమణులు.

'భవమరణ రహితమైన ఆ మహేశ్వరుని చరణములనే శరణు చెందాలి' అంటారు రమణులు.

* * *

మన భారతీయ ఆధ్యాత్మిక వాఙ్మయమంతా వాగి వాగి చివరికి "శరణాగతి"కి శరణు చెందింది.

ఆ శరణాగతికి మరో ముచ్చటైన మాటే - భగవదిచ్ఛ.

బాహ్యంలో 'కర్మాచరణ' ఉండాలి...

ఆంతరంలో 'భగవదిచ్ఛ' అని ఉండాలి...

మంచి జరిగినా, చెడు జరిగినా...

పొంగక, క్రుంగక...

మన మనసులోనూ, మన నోటిలోనూ...

ఎప్పుడూ 'భగవదిచ్ఛ' అనే మాట నానుతూ ఉండాలి...

ఇది జ్ఞానపంచాక్షరీ మంత్రం...

* * *

ఈశ్వరునికి శరణాగతి చెందినవాని 'ప్రారబ్ధం' మాటేమి? అంటే, దాని యొక్క తీవ్రత తగ్గుతుంది...

తలకు తగలవలసిన బాణం తలపాగాకు తగిలి పడిపోతుంది...అంటారు భగవాన్.

నిజానికి పురుషప్రయత్నం, ప్రారబ్ధం రెండూ భగవదిచ్ఛలో అంతర్భాగాలే.

* * *

తత్ సృష్ట్వా తదేవానుప్రావిశత్

ప్రతి వస్తువు లేదా ప్రతి జీవిని సృష్టించి

భగవంతుడు దానిలో దాక్కొన్నాడు... అంటోంది తైత్తిరీయం.

కాబట్టి దృశ్యం యావత్తు భగవత్స్వరూపంగా చూడగలగడమే శరణాగతి యొక్క దివ్యఫలం.

* * *

<u>229. ఉద్దేశపూర్వకంగా తెచ్చుకున్న మరపు  మేలుకో... మేలుకో...</u>

కాశీయాత్రకెళ్లి వస్తాం...

ఈయాత్ర మొత్తంలో అనేక వేలమందిని మనం చూసి ఉంటాం.

ఇంటికొచ్చాక, అందులో ఒక్కరి ముఖం కూడా జ్ఞాపకం ఉండదు.

ఈ జ్ఞాపకం లేకపోవడం అనేది రోగసంబంధమైన మతిమరపు లాంటిది కాదు.

వారికి ప్రాధాన్యత ఇవ్వకపోవడం వలన వచ్చిన మరపే అది.

* * *

గొప్ప శాస్త్రకారుడికి శాస్త్రవిషయాలన్నీ ఏకకాలంలో జ్ఞాపకం ఉండవు. అన్నీ మరపులోనే ఉంటాయి.

అవసరమైనప్పుడు జ్ఞాపకానికొస్తాయి.

ఇది ఆరోగ్యకరమైన మరపే.

* * *

జ్ఞాపకం అనేది మహా సముద్రం.

మనం కేవలం ఉపరితలభాగంలోనే దాదాపుగా ఉంటాం.

అవసరమైనప్పుడు మాత్రమే కళ్లుమూసుకొని (అంతర్ముఖులమై) గుర్తుకు(ఉపరితలానికి) తెచ్చుకొనే ప్రయత్నం చేస్తాం.

'లోతుగా ఆలోచించు చూడు...' అనే మాటకు అర్థం ఇదే.

'అట్టడుగున పడిపోయిన జ్ఞాపకాల్ని ఉపరితలానికి తీసుకురా...!' అని ఆ మాటకు అర్థం.

ఆ లోలోతుల్లో గతజన్మ జ్ఞాపకాలు కూడా ఉంటాయి.

అయితే deep గా వెళ్లగలగాలి...

అలా deep గా వెళ్లే ప్రయత్నానికే తపస్సు అని పేరు.

బాబు, బాబు యొక్క ప్రపంచం అనేది...

కేవలం ఉపరితలంలోని విషయం మాత్రమే.

కానీ నేను ఇది మాత్రమే కాదు;

'నేను' అంటే మొత్తపుజ్ఞాపకరాశి.

* * *

మా ఇంటి వెనుక మూడు చిన్న అద్దిళ్లు ఉన్నాయి...

అందులో ఒక ఇంట్లో ఓ ఉద్యోగి ఉండేవాడు

ఓరోజు అతనింట్లోకి పాము దూరింది...

పాం...పాం...అంటూ బయటకు పరుగెత్తుకొచ్చి -

"ఎవరైనా మగవాళ్లు ఉంటే పిలవండి, ఎవరైనా మగవాళ్లు ఉంటే పిలవండి...." అంటూ కేకలు పెట్టాడు.

పక్కింట్లో కాపురముంటున్న ఒకావిడ తీరుబడిగా బయటకొచ్చి- "ఏం...! హడావుడిలో నువ్వు మగాడివి అన్న విషయం మరచినట్టున్నావే...!" అంది వ్యంగ్యంగా...

అందరూ తెగ నవ్వారు....

అలా ఈ ప్రపంచపు హడావుడిలో పడి తాను బ్రహ్మమన్న విషయం మరచిపోయి, బ్రహ్మజ్ఞానం కోసం ఇంకొకరిని(గురువును) ఆశ్రయించవలసిన అగత్యం ఏర్పడింది.

తాను స్వరూపతః శుద్ధపరబ్రహ్మస్వరూపం.

బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి...

బ్రహ్మను తెలుసుకొన్నవాడు బ్రహ్మమే అవుతాడు...అని వేదసూక్తి.

క్రొత్తగా బ్రహ్మం అవడం ఏమీ కాదు...

తాను యెప్పుడూ బ్రహ్మమే.

పోయింది, కలిగింది జ్ఞాపకమేగాని, బ్రహ్మత్వం  కాదు.

బ్రహ్మత్వాన్ని మరచిపోవడమే బ్రహ్మహత్య.

* * *

శేషాద్రిస్వామి ఒక భక్తుణ్ణి- "నీకు బ్రహ్మహత్యాపాతకం చుట్టుకొనుగాక!" అని వెళ్లిపోయారు. అతడు హడలిపోయి భగవాన్ వద్దకు వచ్చి శేషాద్రిస్వామి శాపం గురించి చెప్పాడు-

రమణులు అంతా శ్రద్ధగా విని, "బ్రహ్మమును తెలుసుకోని వారందరూ బ్రహ్మహత్యాపాతకులే. మిమ్మల్ని బ్రహ్మస్వరూపాన్ని తెలుసుకోమని ఆయన మాటలలోని ఆంతర్యం. అంతేగాని ఆయన ఎవరికీ శాపం ఇవ్వరు" అన్నారు.

* * *

దేవుడు తనను మరచి జీవుడైనాడు.

జీవుడు తనను మరచి దేవుడవ్వాలి.

దేవుడికి కలిగిన మరపు రోగసంబంధమైనది కాదు.

అది ఉద్దేశపూర్వకంగానే తెచ్చుకున్న మరపు.

రామారావు అనే నటుడు రంగస్థలం పైన కృష్ణధారిగా నటిస్తాడు. అక్కడ తత్కాలికంగా నేను రామారావు అనేది మరచి, కృష్ణుడుగానే ఉంటాడు. అలా లేకపోతే పాత్ర పండదు.

ఈ ఉద్దేశపూర్వకమైన మరపు వల్లనే అతను మహానటుడు అవుతాడు.

అలాగే భగవంతుడు మహానటుడు.

ఈ జగన్నాటకం అంతా ఉద్దేశపూర్వకంగానే జరిగింది.

* * *

ఉద్దేశపూర్వకంగా దేవుడనే విషయం మరచి, జీవుడనే పాత్రతో మమేకమై ఉండడమే - జీవితం.

ఉద్దేశపూర్వకంగా తిరిగి జీవుడుగా ఉన్న తాను దేవుడయ్యే ప్రాసెస్స్ - ఆధ్యాత్మికం.

* * *

దేవుడు జీవుడయ్యే శక్తికి సిద్ధి అని పేరు.

జీవుడు దేవుడయ్యే శక్తికి సాధన అని పేరు.

* * *

గాఢనిద్రలో ఏకంగానే ఉన్నావు...

మెలకువలో అనేకం అయినావు...

ఇంతకంటే గొప్ప మహిమ; సిద్ధి ఇంకేముంటుంది?

నీ శక్తి నీకు తెలియక అశక్తుడవై జడంగా పడివున్నావు...

లే...

లేచి నిలబడు...

ఊతకర్రలకై వేచి చూడకు...

* * *

ఏదైనా దుస్స్వప్నం వచ్చినప్పుడు...

ఆ అయిష్టతను భరించలేక...

కలను విదిలించుకొని మేలుకొన్నట్లు...

అలా ఈ జాగ్రత్స్వప్నాన్ని విదిలించుకుని మేలుకో...

* * *

**230. ప్రార్థన**

1. సుఖమును దుఃఖము, దుఃఖమును సుఖము వరుసగా ఒకదానికొకటి అనుసరించి ఉన్నవి. సూక్ష్మము వైపునకును, స్థూలమువైపునకును ఈ వరుస అనంతముగా తోచుచునే ఉన్నది. వీటిని అంటక చూచుచున్న నా గురువును శరణువేడుచున్నాను.

2. జ్ఞానమును అజ్ఞానము, అజ్ఞానమును జ్ఞానము

వరుసగా ఒకదానికొకటి మూలములై అనుసరించి ఉన్నవి. సూక్ష్మము వైపునకును, స్థూలము వైపునకును ఈ వరుస అనంతముగా తోచుచునే ఉన్నది. వీటిని అంటక చూచుచున్న నా గురువును శరణువేడుచున్నాను.

3. వెలుగును చీకటి, చీకటిని వెలుగు వరుసగా ఒకదానికొకటి మూలములై అనుసరించి ఉన్నవి. సూక్ష్మము వైపునకును, స్థూలము వైపునకును  ఈ వరుస అనంతముగా తోచుచునే ఉన్నది. వీటిని అంటక చూచుచున్న నా గురువును శరణువేడుచున్నాను.

4. నిశ్శబ్దమును శబ్దము, శబ్దమును నిశబ్దము వరుసగా ఒకదానికొకటి మూలములై అనుసరించి ఉన్నవి. సూక్ష్మము వైపునకును, స్థూలము వైపునకును, ఈ వరుస అనంతముగా తోచుచునే ఉన్నది. వీటిని అంటక చూచుచున్న నా గురువును శరణువేడుచున్నాను.

5. ద్వంద్వములన్నియు ఇట్లే అని వీటిని అంటక చూచుచున్న వానిని శరణువేడుచున్నాను. చెట్టుముందా? విత్తుముందా? గ్రుడ్డుముందా? పిల్లముందా? మొదలగు ప్రశ్నలకు కూడా ఇదే సమాధానం కాబట్టి ఇట్టి సందేహములన్నింటికీ అంటక ఉన్న నా గురువును శరణువేడుచున్నాను.

6. ఒకప్పుడు, ఇప్పుడు, ఎప్పుడూ అనగా భూత వర్తమాన భవిష్యత్తులు వరుసగా ఒకదానికొకటి మూలములై అనుసరించి ఉన్నవి. స్థూలము వైపునకును, సూక్ష్మము వైపునకును ఈ వరుస అనంతముగా తోచుచున్నది. వీటిని అంటక చూచుచున్న నా గురువును శరణువేడుచున్నాను.

7. అక్కడ, ఇక్కడ, ఎక్కడా అనునవి వరుసగా ఒకదానినొకటి మూలములై అనుసరించి ఉన్నవి. స్థూల సూక్ష్మముల కిరువైపులకు ఈ వరుస అనంతముగా తోచుచున్నది. వీటిని అంటక చూచుచున్న నా గురువును శరణువేడుచున్నాను.

8. జీవ జగత్ ఈశ్వరులనునవి వరుసగా ఒకదానినొకటి మూలములై అనుసరించి ఉన్నవి.  స్థూల సూక్ష్మముల కిరువైపులను ఈ వరుస అనంతముగా తోచుచున్నది.వీటిని అంటక చూచుచున్న నా గురువును శరణువేడుచున్నాను.

9. కర్త-కర్మ-క్రియలు వరుసగా ఒకదానినొకటి మూలములై అనుసరించి ఉన్నవి. స్థూల సూక్ష్మముల కిరువైపులను ఈ వరుస అనంతము తోచుచున్నది. వీటిని అంటక చూచుచున్న నా గురువును శరణువేడుచున్నాను.

10. ప్రశ్న, అన్వేషణ, సమాధానములు వరుసగా ఒకదానినొకటి మూలములై అనుసరించి ఉన్నవి. స్థూలసూక్ష్మముల కిరువైపుల ఈ వరుస అనంతముగా తోచుచున్నది. వీటిని అంటక చూచుచున్న నా గురువును శరణువేడుచున్నాను.

11. త్రిపుటులన్నియు ఇట్లే అని వీని నంటక చూచుచున్న నా గురువును శరణువేడుచున్నాను.

12. కనులు తెరచి చూచిన కనుపించునది భూతాకాశము.

దానియందలి నామరూపాత్మక జగత్తు.

కనులు మూసి చూచిన కనుపించునది చిత్తాకాశము.దానియందలి తలంపులు.

ఈ రెండు ఆకాశములను చూచునది చిదాకాశము. వీటిని అంటక చూచుచున్న నా గురువును శరణువేడుచున్నాను.

13. ఉన్నది ఒక్కటే.

అన్యము లేనేలేదు.

ఆ ఉన్నదే నేను అని ఉండుట

జ్ఞానయోగము.

ఉన్నది ఒక్కటే.

అన్యము లేనేలేదు.

ఆ ఉన్నదే నీవు అని ఉండుట

భక్తియోగము.

ఉన్నది ఒక్కటే.

అన్యము లేనేలేదు.

ఆ ఉన్నదే అతడు అని ఉండుట

కర్మయోగము.

ఈ మూడూ ఒకదానినొకటి మూలములై అనుసరించి ఉన్నవి. ఈ మూడింటిని అంటక చూచుచున్న నా గురువుకు శరణువేడుచున్నాను.

14. నేనని అనుచున్నది అహంకారం.

నేనుగా ఉన్నది అహంస్వరూపం.

మొదటిది దేహమాత్రము.

రెండవది దేహము లోపల వెలుపల నిండియున్నది.

వీనిని అంటక చూచుచున్న నా గురువును శరణుపేడుచున్నాను.

15. బుద్ధికి అందినంతవరకు గల ప్రపంచము విశ్వాంతరాళమునందే పుట్టి, పెరిగి, ఉనికి గలిగి అందే లీనమగుచున్నది. సకలమునకు విశ్వాంతరాళమే మూలకారణము. ఇది అనంతము కూడా. ఎరిగిన వాటి కన్నిటి కంటే పెద్దది. త్రిమూర్త్యాత్మకమని చెప్పబడునది ఇదియే.

ఇదియే శక్తి, ఇదియే పదార్థము. వాఙ్మానస గోచరమగునంత వరకు ప్రపంచమని, తరువాతది పరమాత్మయనియు అనుభవింపబడుచున్నది. దీనిని అంటక చూచుచున్న నా గురువుకు శరణుపేడుచున్నాను.

16. అజ్ఞానిగా తోచుచున్న గురుపే శిష్యుడు.

జ్ఞానరూపమున తోచుచున్న శిష్యుడే గురువు.

తారతమ్యములెక్కడ? వీరిరువురిని అంటక చూచుచున్న నా గురువును శరణుపేడుచున్నాను.

17. భగవంతునితో సమానుడైన భక్తుడు లేడు.

భక్తునితో సమానుడైన భగవంతుడు లేడు.

భక్తుడనగా సాకారుడగు భగవంతుడు.

నిరాకారుడైన భక్తుడే భగవంతుడు.

వీరిరువురుని అంటక చూచుచున్న నా గురువును శరణుపేడుచున్నాను.

18. విని చూడు; తాకి చూడు; రుచి చూడు; వాసన చూడు; తలచి చూడు అని పలువిధముల చూచుటే చెప్పబడుచున్నది. అన్ని చూపులు చూడగల కన్నే కన్ను. అదే మూడవ కన్ను. అట్టి కన్ను గల వానిని అంటక చూచుచున్న నా గురువును శరణుపేడుచున్నాను.

19. నిద్రించు బిడ్డకు కలవరింతలు, పలవరింతలు ఉన్నప్పుడు విభూతి పెట్టుట, రక్షలు కట్టుట, వైద్యములు చేయుంచుట ప్రసిద్ధము. సత్యదర్శనమున వేదముల వాక్కులు, బ్రహ్మర్షుల దర్శనములు కూడా పలవరింతలు కలవరింతల వంటివే...అన్నచో ఇతరముల ఎన్నుట ఎందులకు? దీనినంతటిని అంటక చూచుచున్న నా గురువును శరణువేడుచున్నాను.

20. ఉనికి జ్ఞాన లక్షణము. జ్ఞానము ఉనికి లక్షణము. జ్ఞానము ఆనంద లక్షణము. ఆనందము జ్ఞాన లక్షణము. లక్షణమే స్వరూపము. స్వరూపమే లక్షణము. దీనినంటక చూచుచున్న నా గురువును శరణువేడుచున్నాను.

21 అణువుకు కేంద్రము ఉన్నది. పిండమునకు కేంద్రము ఉన్నది. అనంతమై యున్న విశ్వమునకు కేంద్రమున్నది ఈ మూడును అండాకారములుగా పెద్దలు వర్ణించిరి. తన్ను తానెరుగని స్థితిలో మూడింటికి వేర్వేరు కేంద్రములుగా తోచినను, ఎరిగిన స్థితిలో మూడింటికి ఒకే కేంద్రమనుట అనుభవసిద్ధము. ఆ కేంద్రమే తాను. వీనినన్నింటికి అంటక చూచుచున్న నా గురువును శరణువేడుచున్నాను.

* * *

## <u>231. సద్గురు మహిమ</u>

మహిమ అంటే ప్రకృతి స్వభావానికి మించిన శక్తి

ఓ వ్యక్తి ద్వారా ప్రకటనం కావడం.

* * *

అది ఆ ప్రత్యేక వ్యక్తికి మాత్రమే ఎలా సాధ్యం?

సాధన వలన సాధ్యమా? లేక

అది అప్రయత్నంగా సిద్ధిస్తుందా?

ఇంతకీ మహిమల వలన  ప్రయోజనం ఏమి?

ఏది ముఖ్యం....మహిమా? జ్ఞానమా?

* * *

సాధకుడు భగవత్సాక్షాత్కారం కొఱకు ప్రయత్నిస్తున్నప్పుడు, ఈ పరిమితి మనసు అనంతాత్మతో తల్లీనమవుతున్న తరుణంలో

ప్రకృతికి మించిన శక్తి పరాప్రకృతి యొక్క శక్తులు తనను ఆవహిస్తున్న సమయంలో కొన్ని సిద్ధులు అప్రయత్నంగా తన ద్వారా ప్రకటనం కావడం జరుగుతుంది.

సాధకుడు సిద్ధుడు అవుతాడు.

మనసు ఆత్మగా మారుకుంటున్న

ఆ సంధ్యాసమయంలో -

ఇవన్నీ పరమాత్ముని ద్వారా వ్యక్తమౌతున్న శక్తే తప్ప తనది కాదన్న జ్ఞానం సుస్థిరమైతేనే పరమగమ్యం చేరగలడు.

లేదంటే ఆ సిద్ధుల వలన ఉన్నత స్థితి నుండి జారి అధోగతి పాలౌతాడు.

* * *

బంగారంపై ఆశలేని వానికే స్వర్ణసిద్ధి కలిగినట్లు

సిద్ధులపై దృష్టిలేనివారికే సర్వసిద్ధులూ కలుగుతాయి.

సంసారంలో మునిగిపోతూ ఒకడు తనను తరింపచేయమని ఆర్తితో శరణన్నవాణ్ణి కాపాడ్డానికి సిద్ధుడు అసంకల్పితంగా ఉపయోగించే ప్రక్రియే "మహిమ".

మహిమ అనేది వ్యవస్థను చక్కబరచడానికేగాని

కీర్తిప్రతిష్టలకు కాదు.

ప్రకృత్యాతీతశక్తి ఒకటి ఉందని మానవునికి గుర్తుచేసేందుకు దోహదపడేదే మహిమ.

అచలంగా ఉన్న చైతన్యం క్రియాశీలం అవడమే

తొలి మహిమ.

"తండ్రి నేను అభిన్నులం" అని క్రీస్తు అన్నప్పుడు,

తాను పరమతండ్రితో(అనంతశక్తితో) మమేకం అయి ఉన్నారు.

తాను ఈ మహిమను ప్రకటించాను...అన్న స్పృహ వారికి లేదు. అందువల్లనే క్రీస్తు మానవుడిగా కనబడినా మానవాతీత కార్యాలను వారు చేశారు.

భౌతిక నియమాలేవీ ఆ సిద్ధుని సన్నిధిలో పని చేయవు.

ఆ "ఈశ్వరనియతి"ని మాటల్లో  మనం వివరించుకోలేం...

మన మెదడుకున్న పరిమితులు అంతే మరి.

మహిమ అనేది యెప్పుడూ ఉంది...

"విశ్వాసం"తో  దానిని చవిచూడగలడు ఎవడైనా.

శిష్యునికి జ్ఞానప్రబోధం కంటే ముందుగా

శక్తి నిరూపణం(మహిమ) చేయగలగాలి గురువు.

అప్పుడే గురువు మీద గురి కుదిరి,

శ్రద్ధగా జ్ఞానప్రబోధాన్ని స్వీకరించగలడు శిష్యుడు.

మన భారతీయ ప్రాచీన గురువులందరూ అంటువంటి శక్తి సంపన్నులే...

జ్ఞానం శక్తిపూర్ణంగా ఉండాలి.

శక్తి జ్ఞానపూర్ణంగా ఉండాలి.

ప్రపంచానికి ఆవల నుండి ప్రసారమయ్యే ఆ దైవీశక్తికి ఓ వాహకంలా తానుండి, ఎంతోమందికి

భౌతిక,మానసిక,అధ్యాత్మిక సమస్యలను తీరుస్తూ స్వస్థత చేకూరుస్తారు గురువులు...

విశ్వశక్తికి తానొక వాహకంగా ఉన్నానన్న స్పృహ వలన, ఇతరుల కష్టసుఖాలను స్వీకరించడంలో ఆనందాన్ని పొందుతాడు  సిద్ధుడు.

మహిమను ఎప్పుడూ భగవద్విశ్వాసాన్ని పెంపొందించే విధంగా మలచుకోవాలేగానీ, వాటికై ప్రాకులాడకూడదు.

నిజానికి ప్రతీది మహిమే.

మహిమే జీవితంగా ఉంది.

కాకపోతే అది అందరికీ సర్వసామాన్యమై  ఉండడం వలన అవి మహిమలుగా తోచడం లేదు అంతే.

ఎవరూ చేయని, చూడని మహిమను చూడగలిగినప్పుడు మాత్రమే దానిని మహిమగా తీసుకుంటున్నాడు.

కదలని ఆకాశంలో భూమి కదలడం మహిమ కాదా?

కదిలే భూమిపై మనం నిశ్చలంగా ఉండడం మహిమ కాదా?

చూడగలిగే దృష్టి ఉండాలిగాని, మహిమ కానిదంటూ ఏమీ ఉండదు.

ప్రతి కదలికా దేవుని మహిమే.

* * *

## 232. అది అంతే - ఇది ఇంతే

'అది' ఉంది ఎలాగో.

'ఇది' లేదు ఎలాగూ.

'ఇది' ఉన్నప్పుడు 'అది' తల్లి, తండ్రి, గురువు, దైవము, యజమాని, స్నేహితుడు, బంధువు.

'ఇది' లేనప్పుడు ఉండేది 'అదే'.

'అది'కి సన్నిహితంగా ఉంచేది నిరహంకారం, కోరికలు లేని స్థితి, సత్వగుణం, నిష్కామకర్మ, స్థితప్రజ్ఞత, పరోపకారం, దయ, జాలి, కరుణ, ప్రేమ, నిస్వార్థం, వైరాగ్యం, జ్ఞానం...

ఇవి సన్నిహితం చేస్తాయేగాని 'అది' గావు.

'అది'గా ఉండాలంటే 'అది'గా ఉండాలంతే.

'అది' రెండు 'అది'లు కాదు.

'అది' ఒకటే.

'ఇది' అనేకం.

'అది' ఉంటే 'ఇది' ఉండదు.

'ఇది' ఉంటే 'అది' ఉండదు.

'అది' కావాలనుకుంటే 'అది'గా ఉండాలంతే.

'ఇది'గా ఉన్నంతవరకు 'అది' కుదరదు.

నేను 'ఇది' కాదు 'అది'.

'ఇది'గా ఉంటే మనశ్శాంతి లేదు.

'అది'గా ఉంటే మనస్సనేదే లేదు.

నిజానికి 'అది'లో 'ఇది' లేదు.

'ఇది'లో 'అది' లేదు.

ఉన్నది 'అది' ఒక్కటే.

'అది'లో ఐక్యమవ్వాలని 'ఇది'కి ఎంతో ఇదిగా ఉంది.

'ఇది'గా ఉన్నంతవరకు అది సాధ్యమయ్యే పనేనా?

'అది' నా స్వస్థలం. నా స్వభావం.

'ఇది' కాదు.

'అది అంతే'.

'ఇది' ఇంతే.

'అది' అమ్మ.

'ఇది' శిశువు.

'అది' నుండి ఇది రావాలేగాని,

'ఇది' నుండి 'అది' రాదు.

'ఇది'కి 'ఇది'గా ఉండడం ఇష్టం లేదు.

'అది'గా ఉండడం చేతగాదు.

అందుకే 'ఇది' శరణాగతి.

'ఇది'గా ఉన్నంతవరకు శరణాగతి తప్పదు, తప్పుకాదు.

'అది'గా ఉండనంతవరకు విముక్తి లేదు.

జ్ఞానం, అజ్ఞానం 'ఇది' యొక్క లక్షణాలు.

ఏ లక్షణాలు లేనిది 'అది'. 'ఇది'ని నిర్వచించగలమేగాని,

'అది'ని నిర్వచించలేం.

నిర్వచిస్తే 'అది' 'ఇది' అయిపోతుంది.

'అది' ఎంత దగ్గరో, అంత దూరం.

'అది' ఎంత సులభమో అంత కష్టం.

'ఇది' మాయ.

'అది' మాయకు అందదు.

'ఇది' 'అది'గా ఉంటే 'ఇది' 'అది'.

'ఇది' 'ఇది'గా ఉంటే 'ఇది' 'ఇదే'.

'ఇది' అంతా పాపపుణ్యాలే.

'అది'కి పాపపుణ్యాలు లేవు.

'అది' సాధించబడేది, పొందబడేది కాదు.

'ఇది' వదిలేస్తే మిగిలేది 'అదే'.

ఇది, అది చెప్పేవాడికి 'అది' తెలియదు.

'అది' తెలిస్తే ఏమీ చెప్పడు.

'అది' తెలిసినవాడు చెప్పినా చెప్పనట్టే. చెప్పకపోయినా చెప్పినట్టే.

'ఇది'ని 'అది'కి వదిలేస్తే అంతా 'అదే' చూసుకుంటుంది.

వదలకపోయినా 'అదే' చూసుకుంటుంది.

'అది' సద్వస్తువు.

'ఇది' దాని నీడ.

'అది' వలన 'ఇది'కి ఉనికి.

'ఇది' వలన 'అది'కి ఉనికి కాదు.

'ఇది'యే కర్త కర్మ క్రియ.

'అది' కర్తా కాదు, కర్మా కాదు, క్రియా కాదు.

బంధమోక్షాలు ఉండేది 'ఇది'కి.

'అది'కి కాదు.

* * *

## 233. పరిపక్వత అనేది పలుకులలో లేదు, మౌనంలో ఉంది

సతీష్ అన్నాడు ఓ రోజు-

మూఢమతులను సైతం జ్ఞానసంపన్నులుగా మార్చగలిగే శక్తి ఉన్న గురువును వదిలి...

రమణాశ్రమం వెళ్లి....

"తప్పిపోయిన బిడ్డ తిరిగి తన తల్లి వద్దకు చేరినట్లు అనుభూతి చెందాను....నా మనస్సు శాంతించింది...."

అని వ్రాశారు మీ వ్యాసాల్లో...

మరి అటువంటి శాంతిని మన గురువు ఇవ్వలేకపోయారా? అని ప్రశ్నించాడు.

* * *

యెంత గొప్ప ఉపాధ్యాయుడైనా తన బిడ్డల్ని మరో పాఠశాలలో(మరో ఉపాధ్యాయుని వద్ద) చేరుస్తాడు.....

18 పురాణాలను వ్రాసిన వ్యాసుడు సైతం శుకుడ్ని జనకుని వద్దకు పంపాడు...

తాను చెప్పలేక కాదు....తాను చెప్పవలసినదంతా చెప్పాడు...

కానీ శుకుడికి ఏదో తెలియని అసంతృప్తి అలానే మిగిలిపోయింది.

వ్యాసుడు ఏదైతే చెప్పాడో, అదే జనకుడూ చెప్పాడు....

కాకపోతే జనకుడు చివర్లో నొక్కి వక్కాణించినది ఒకటి ఉన్నది....

శుకా! మీ తండ్రిగారు నీకు బోధించక మునుపే, నీవు ఆత్మతత్త్వమును తెలుసుకుని ఉన్నావు...అదే మీ తండ్రిగారూ బోధించారు, నేనూ బోధించాను....ఇంతకు మించి ఏమీలేదు...నీవు తెలుసుకోవలసింది ఏమీలేదు....ఆ బోధలోనే స్థిరపడు...ఆత్మనిష్ఠుడవై ఉండు.

"ఇంతకు మించి ఏమీలేదు"

అనే జనకుని ముద్ర కోసం వ్యాసుడు జనకుని వద్దకు పంపారు.

అలానే నేను గురుసాంగత్యంలో అన్నేళ్లు ఉన్నప్పటికీ, యెన్నో ప్రబోధాలు విన్నప్పటికీ

పరమశాంతిని అనుభూతి చెందలేకపోవడానికి కారణం- వారితో చెలిమి, చనువు...

రమణతత్త్వాన్ని అధ్యయనం చేసిన తరువాత తెలిసింది....

రమణమహర్షే సుబ్రహ్మణ్య మహర్షిగా ఉన్నారని....

రమణతత్త్వానికి కొనసాగింపే సద్గురు తత్త్వమని...

* * *

ఓ రాత్రి భుజానికి రమణాశ్రమం సంచి తగిలించుకుని, రమణాశ్రమం బయలుదేరాను...యెక్కడకు బయలుదేరినా గురువు వద్ద విబూధి పెట్టుకుని వెళ్లడం ఆనవాయితీ....

గురువుగారు బొట్టు పెడుతూ అన్నారు...నీవు రమణాశ్రమం చేరుకోగానే, రమణుడు ఇక్కడికి చేరుకుంటాడు అని.

నిజమే....రమణసన్నిధికి చేరుకోగానే....

"నా కోసం ఇన్ని మైళ్లు ప్రయాణం చేసి రావాలా?

నేను అక్కడే నీ గురురూపంలో ఉండేది నేనే కదా!"

అని రమణులు నా చెవిలో గొణిగినట్టయ్యింది....

* * *

ఒక యోగితో ఓ మూడుసార్లు అరుణాచలప్రదక్షిణం చేసే భాగ్యం నాకు కలిగింది...

వారు ఉన్న చోటనే ఉంటారు....యెక్కడికీ కదలరు....

అలాంటిది నా కోసం నా వెంట నడిచారు...

కాదు కాదు...వారి వెంట నేను నడిచాను....

నేను తరచూ అరుణాచలం వెళుతుంటే,

ఆ యోగి ఇలా అన్నారు-

ఏముంది అరుణాచలంలో ? రమణాశ్రమంలో ?

ఎక్కడకు పోయినా అవే గోడలు, అవే చెట్లు, అవే కొండలు....అని.

నా అనవసర అత్యుత్సాహం మీద నీళ్లు చల్లినట్టయిపోయింది...

ఆసక్తితో అరుణాచలం వెళ్లడం అదే చివరిసారి అయ్యింది.

నిజమే కదా.....ఎక్కడకుపోయినా అవే గోడలు....అవే చెట్లు....

దేనికైనా  విలువను మనమే ఆపాదిస్తాం.... ఆరాధిస్తాం....

కొండ అంటే కొండే....శివుడంటే శివుడే....

వారి చిన్ని ప్రబోధం నాలో యెంతో ఆధ్యాత్మిక పరిపక్వతను కలిగించింది...

అప్పట్నుంచి అతనిని నా గురువుగా కూడా భావించడం మొదలుపెట్టాను....

నేనున్నచోటనే దైవానుభూతిని చెందడం అలవాటయ్యింది....

నేను 30 సార్లు అరుణాచలం వెళ్లాను....అని గొప్పలు చెప్పుకుంటుంటారు కొందరు....

అంటే, తాము ఉన్న చోటనే భగవంతుణ్ణి అనుభవించడం చేతగానితనాన్ని 30 సార్లు ప్రకటించుకున్నట్టు....

షిరిడీ బాబా అన్నారు కదా....

షిరిడీలో మాత్రమే నేనున్నానని వచ్చేవారికి

నేనంటే వారికి అర్థం కానట్టే...అని.

షిరిడీయాత్ర అంటే

సర్వస్వశరణాగతికి రంగం సిద్ధం చేయడం.

అంతేగాని షిరిడీలోని బజారు సరుకును

మనింట్లోకి బదిలీ చేయడం కాదు.

బరువుతో వెళ్లి, తేలిగ్గా తిరిగి రావాలి.

కానీ జరిగేది తేలిగ్గా వెళ్లి బరువుతో తిరిగి వస్తున్నారు.

* * *

గురువుగారుగారన్నారు ఓసారి-

అరుణాచలం వెళ్లు....తప్పులేదు....

కానీ ఈశ్వరుడి కోసం వెళ్లొద్దు....అని.

అంటే ఊళ్లు చూడ్డానికి వెళ్ళొచ్చుగానీ, దేవుని కోసమంటూ వెళ్ళొద్దు....అని.

భగవంతుడు -

నీవున్న చోటనే ఉన్నాడు....

నీలోనే ఉన్నాడు....

నీవుగానే ఉన్నాడు....

ఆయన కోసం ఒక్క అడుగు కూడా వేయవలసిన అవసరం లేదు.

* * *

ఇప్పుడు నాకు మా సత్సంగమే రమణాశ్రమం అయ్యింది....

మా గురువే రమణభగవాడు అయ్యాడు....

మా అనిలాచలమే అరుణాచలం అయ్యింది...

అందుకే మా గురువుగారు అంటుంటారు-

నీవు క్షేత్రం వెళ్లడం కాదు

నీవున్న చోటే క్షేత్రం కావాలి.

నీవు వేదం పలకడం కాదు

నీవు పలికేది వేదం కావాలి. అని

* * *

పరిపక్వత అనేది పరుగులలో లేదు.

నిశ్చలతలో ఉంది.

పరిపక్వత అనేది పలుకులలో లేదు.

మౌనంలో ఉంది.

పరిపక్వత అనేది బహిర్ముఖంలో లేదు

అంతర్ముఖంలో ఉంది.

* * *

**234. ఎందుకు? మహా నియంత**

సైన్సు "ఎలా?" అన్నదానికే సమాధానం చెబుతుంది గాని "ఎందుకు?" అన్నదానికి అది సమాధానం చెప్పలేదు...అన్నారు గురువుగారు ఓసారి.

ఆ "ఎందుకు?" అన్న ప్రశ్న నాలో కలకలం రేపింది...

సైన్సు విషయం సరే, దానిని ప్రక్కన పెడదాం....

ఇంతకీ మన భారతీయ తత్త్వశాస్త్రం ఈ ప్రశ్నకు ఏం సమాధానం చెప్పింది? అనే ఉత్కంఠతో చేసిన అన్వేషణ నా ఆధ్యాత్మిక  జీవితాన్ని ఓ మలుపు తిప్పింది.

* * *

భగవంతుడు ఎందుకీ జగత్తును సృష్టించాడు?

భ్రాంతి ఎందుకు కలిగింది?

ఇలా ప్రతిదానికీ ఎందుకు? అని ప్రశ్నించడం అలవాటైపోయింది.

"ఎందుకు?" అన్న ప్రశ్న కొంతకాలం నన్ను భూతంలా వెంటాడింది.

ఈ ఒక్క ప్రశ్ననే పలురకాలుగా, పలుసార్లు ప్రశ్నించాను గురువుగారిని...

వందలకొద్ది గ్రంథాలను తిరగేశాను....

నాకు సంతృప్తినిచ్చిన కొన్ని సమాధానాలను మీ ముందు ఉంచుతున్నాను.

* * *

యోగవాశిష్ఠంలో ఇలా చెప్పబడి ఉంది -

లీల: ప్రతి వ్యక్తి  ఎందుకు వేదనను, అజ్ఞానాన్ని అనుభవిస్తున్నాడు?

సరస్వతి: సృష్టి ప్రారంభమున అనంతచైతన్యము నెలకొల్పిన నియతి అట్టిది.

* * *

వివేకానందులు ఇలా చెప్పారు -

ఎందుకు? అన్న ప్రశ్న తర్క విరుద్ధం.

దేశకాల నిమిత్తాల పరిమితిలో సమాధానం ఏనాటికీ దొరకదు.

ఈ పరిమితి కావల ఏమి సమాధానం ఉందో మనం ఈ పరిమితిని అతిక్రమించితే తప్ప తెలీదు.

* * *

బి.వి.నరసింహస్వామి, రమణుల మధ్య సంభాషణ ఇలా జరిగింది -

బి.వి.నరసింహస్వామి: పరిమితంగానైనా ఈ సృష్టి, ఈ సంసారము దుఃఖమయము పాపపంకిలము ఎందుకైనది?

శ్రీరమణులు: భగవదిచ్ఛ.

బి.వి.నరసింహస్వామి: భగవంతునికి ఆ ఇచ్ఛ ఏమి?

శ్రీరమణులు: అది దుర్జ్ఞేయమూ, అతర్క్యమూ  ఆ సర్వశక్తికి ఇందుకే నిమిత్తమునూ ఆరోపింపలేము.

సర్వసమర్థమూ, సర్వజ్ఞమూ, అపరిమేయమూ అయిన అతనికి కోర్కెయేమి? ప్రాప్యమేమి?

ఆ దైవ సముఖాన జరిగే ఏ కర్మలూ వానిని అంటవు. సూర్యుని ప్రాపంచిక కర్మలనూ పోల్చి చూడు.

ఆ ఏకానికి ప్రయోజనాపేక్షలూ, బాధ్యతలు నిరూపించడంలో అర్థం లేదు.

అత్యంత క్లిష్టమైన పురుషకార-దేవ వాదానికి ఈ 'భగవదిచ్ఛ' సిద్ధాంతం చక్కని పరిష్కారం.

భగవంతుడు సర్వ వివేకి, సర్వశక్తి, మనం విధి నిర్దిష్టాలైన పరికరాలము, మనం చేసే కార్యాలూ, పడే కష్టాలు, భగవంతునికి ఎట్లు నచ్చితే అట్లే. అన్ని భారాలు తనపైనే వేసుకుని మనకాయన శాంతిని ప్రసాదిస్తాడు.

* * *

సద్గురు సుబ్రహ్మణ్యులవారికి,

అరుణాచల నివాసినీ అయిన చిలకమ్మ గారికి

మధ్య జరిగిన సంభాషణ ఇలా ఉంది -

చిలకమ్మ : ఎందుకు పుట్టామో, ఎందుకు జీవిస్తున్నామో తెలియడం లేదు స్వామీ...!

సద్గురు: మనల్ని భూమ్మీదకు పంపినవాడికి మాత్రమే

ఆ రహస్యం తెలుసును.

చిలకమ్మ : అంతేనా స్వామీ....

సద్గురు: అంతే.

ఆ సమస్యను నువ్వు బయటకు చెప్పావు.

మేం చెప్పలేదు. అంతే తేడా.

ఎవడికి వాడికి స్వంతంగా తెలుసుకునే సత్తా ఉన్నట్లయితే వీళ్లే దేవుళ్లయిపోరూ...

(నవ్వుతూ) వీళ్లే దేవుళ్లయిపోతే

'అసలు దేవుడు' ఏమైపోవాల?

* * *

నా ఆధ్యాత్మిక జీవన సౌధానికి నాలుగు స్తంభాలు లాంటివారు -

1. వశిష్ఠులు.

2. వివేకానందులు.

3. రమణులు.

4. సుబ్రహ్మణ్యులు.

అందుకే 'ఎందుకు?' అన్న ప్రశ్నకు ఈ నలుగురూ చెప్పిన సమాధానాలే ఉదాహరణలుగా ప్రస్తావిస్తాను.

ఈ నలుగురూ చెప్పిన సమాధానాలు అంతర్లీనంగా

తత్వతః ఒకటే ఐనప్పటికీ అందులో రమణుల 'భగవదిచ్ఛ' సమాధానం నాకు ప్రియం.

* * *

భగవదిచ్ఛ అంటున్నారు....

భగవంతునికి కూడా ఇచ్ఛ ఉంటుందా? అనిసందేహం రావొచ్చు.

ఎందుకుండదు? ఆయనేమైనా ఉత్త జడుడా?

Everything is Possible for GOD.

ఆయనకు అన్నీ సాధ్యమే.

ఆయన మహా నియంత.

ఇలానే ఉంటాడు, అలా ఉండడు అనేది ఏమీలేదు.

ఎలా అయినా ఉండగలడు.

మన ఇచ్ఛకు, భగవదిచ్ఛకు తేడా ఏమంటే-

ఇచ్ఛ స్వాధీనంలో మనం ఉంటాం.

భగవంతుని స్వాధీనంలో ఇచ్ఛ ఉంటుంది.

* * *

ఇంతకీ ఇప్పుడేమంటారు?

అంతా భగవదిచ్ఛకు వదిలేసి ఊరికే ఉంటే ఎలా?

లోకం స్తంభించిపోదూ...? అంటారేమో....

నా ఉద్దేశం అది కాదు.

నీ పురుషప్రయత్నం కూడా భగవదిచ్ఛలో అంతర్భాగం అనేదే.

ఒకడేదో గొప్ప పని చేశాడని కీర్తిస్తాం.

మరొకడు కాని పని చేశాడని నిందిస్తాం.

ఇద్దరూ అస్వతంత్రులే.

ఇద్దరూ దైవనియతికి బానిసలే.

చట్టాలు, శిక్షలు కూడా ఆ దైవనియతిలో అంతర్భాగాలే.

నీ ద్వారా ఏ కార్యాన్ని నెరవేర్చుకోవాలో

భగవంతుడు నీ చేత బలవంతంగానైనా సరే, నెరవేర్చుకు తీరుతాడు.

సకామ కర్మ అయినా

నిష్కామ కర్మ అయినా

నీ స్వాధీనంలో లేనివి.

* * *

వ్యవహారంలో 'ధర్మాచరణ' ఉండాలి.

అనుభవంలో 'భగవదిచ్ఛ' అని ఉండాలి.

* * *

**235. మౌనం-ఊరక ఉండడం**

ఓసారి గురువుగారిని అడిగాను....

భగవాన్ చెప్పిన "సుమ్మా ఇరు" (ఊరక ఉండడం) అంటే ఏమి? అని.

నీ గురించిగాని,

నీ ప్రపంచం గురించిగాని,

నీ దైవం గురించిగాని

చెప్పకుండా ఏదైనా ఒక విషయం ఉంటే చెప్పు..అన్నారు.

ఏం చెప్పను?......ఏంచెప్పినా ఆ మూడింట్లోకే వస్తుంది...

మౌనం దాల్చాను.

గురువుగారు నవ్వి.....ఇదే సుమ్మా ఇరు అంటే అన్నారు.

* * *

రమణాశ్రమం పాతహాలులో భగవాన్ యెదుట ధ్యానంలో ఉన్న కొందరిని చూసి, "వారంతా ఏం చేస్తున్నారు? అని అడిగాడు ఓ పాశ్చాత్యుడు.

"ఊరక ఉన్నారు" అన్నాడు అతని గైడు.

భగవాన్ అది విని వెంటనే ఇలా సవరించారు-

"వారు ఊరక ఉండలేదు, ఊరక ఉండడానికి సాధన చేస్తున్నారు" అన్నారు.

* * *

కాబట్టి ఊరకున్నట్టు కనపించడం వేఱు,

ఊరకుండడం వేఱు.

ఊరకుండడానికి ఈ ఊరకుండడం ప్రయత్నం అంతే.

సోఫా మీద ఉన్న భగవాను కూడా ఊరకున్నారు.

కానీ ఆ ఊరకుండడం, ఈ ఊరకుండడం ఒకటి కాదు.

ఒక్కలా కనిపిస్తారు అంతే.

ఊరకుండడం వలన ఊరకుండే స్థితిని సాధించాలనే ప్రయత్నం సాధకునిది.

ఊరక ఉండడం అనే స్థితి వలన (మౌనమే తాను అవడం వలన) కలిగిన

ఊరక ఉండడం అనే స్వభావం రమణునిది.

* * *

సాధకుడు ఊరక ఉండడంలో -

తలంపులు లేకుండా చేయడం అనే ఘర్షణ ఉంటుంది.

లేదా తలంపును దాని మూలానికి చేర్చాలనే ప్రయత్నం ఉంటుంది.

సిద్ధుడు ఊరక ఉండడం అనేది -

అలలు లేని సముద్రం వంటిది.

మబ్బులు లేని ఆకాశం లాంటిది.

అక్షరాలు లేని కాగితం లాంటిది.

* * *

సాధన అనేది సిద్ధికి మార్గం కాదు....

రమణులు సిద్ధికై ఏ సాధనా చేయలేదు.

రమణులే కాదు ఏ మహనీయుడూ సాధన వలన

సిద్ధి పొందలేదు.

"సిద్ధి వలననే మార్గం ఏర్పడిందేగాని

మార్గం వలన సిద్ధి కలుగదు."

అంటారు గురువుగారు.

* * *

మరి రమణులు తన యెదుటే ధ్యానసాధన చేస్తున్నవారిని యెందుకు ఖండించలేదు?

ఖండించడం వారి ప్రవృత్తి కాదు....

సాధన వలన ప్రయోజనం ఏమంటే,

సాధనతో పనిలేదనే విషయాన్ని స్వయంగా తెలుసుకుంటారు.

అంతవరకు వద్దన్నా సరే సాధన చేస్తారు....చేసుకోనీ.....

అనే నిర్లిప్తభావన కారణం కావొచ్చు...

* * *

ఊరక ఉండే ఆ అరుణాలఋషి యెదుట

ఊరక ఉండడానికి సాధకులు చేసే ప్రయత్నంలో

అంతర్లీనంగా, తమకే తెలియనంతగా ఓ జెలసీ ఉంటుంది.

ఆ "జెలసీ"నే భక్తి అని , సాధన అని భ్రమపడతాం.....అంటారు గురువుగారు.

మహానుభావుడు సూరీడులా వెలిగిపోతుంటే

కళ్లు తెరచి ఆ దివ్యతేజోమూర్తిని కనులారా కాంచక, మేమెంత ధ్యానపరులమో చూడు అన్నట్టు ఎందుకీ అర్థం లేని సాధనలు? లేవండి...లేవండి...అంటూ ధ్యానం చేసేవాళ్లనందరినీ తట్టి లేపేసేవారట కావ్యకంఠ గణపతిముని.

ఎన్ని దీపాలు వెలిగిస్తే సూర్యుడికి సమానమవుతుంది?

ఎన్ని బావులు కలిపితే సముద్రుడికి సమానమవుతుంది?

భగవానుకు ఊరక ఉండడం అనేది అప్రయత్నంగా దొరికింది.

సాధకులకు ఊరక ఉండడం అనేది ప్రయత్నంగా ఉంటోంది.

భగవాన్ తరువాత భగవాన్ రాలేదు...రారు.

గురువుగారు అంటుంటారు-

"జ్ఞాని పుడతాడు. తయారుకాడు" అని.

మనం తయారుకావాలని చూస్తున్నాం.....

అది వీలుకాదు.

ఇది నిరాశావాదంగా కనిపించవచ్చు.

"ప్రయత్నంతో  పొందలేం" (అంటే కదలడం ద్వారా పొందలేం) అనే విషయాన్ని

నిస్సందేహంగా తెలుసుకొంటే అదే ఆశావాదం.

అంత్యనిష్ఠూరం కన్నా ఆదినిష్ఠూరం మేలు అన్నారు పెద్దలు.

ప్రయత్నం కంటే ప్రయత్న విరమణే ( ప్రశాంతంగా ఉండటమే) దగ్గరిమార్గం

ఊరక ఉండడానికి (మౌనంగా ఉండడానికి).

* * *

పసి పిల్లలు గతాన్ని జ్ఞప్తిలో ఉంచుకోరు.

భవిష్యత్తును ఊహించరు.

వారు సదా వర్తమానంలో ఉంటారు.

అలా నవశిశువు వలె

"ప్రస్తుతక్షణం"లో ఉండగలిగితే

అదే "ఊరక ఉండడం" అవుతుంది.

* * *